
సాక్షి
తిరుపతి

సోమవారం ၊ 21 ၊ ఏప్రిల్ ၊ 2025



జలాశయం.. నిరాశమయం

అరణియార్ ఆధునికీకరణ పనులు ముందుకు సాగడం లేదు. జలాశయం అభివృద్ధి సాగక పోడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. - 8లో



పంట దున్నేసింది

కోట మండలం కొత్తపట్నంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను క్రిస్ సిటీ యాజమాన్యం దున్నేసింది. - 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

శ్రీవేంకటేశ్వరస్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జిల్లా జడ్జి అరుణ సారిక ఉన్నారు. - 8లో

న్యూస్‌రీల్

25 శాతం సీట్లు పేదలకు ఇవ్వాల్సిందే

తిరుపతి అర్బన్: ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు పేదలకు ఇవ్వాల్సిందే డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యాహక్కుచట్టాన్ని 2025–26 నుంచే అమలు చేస్తున్నామన్నారు. 2009 సెక్షన్ 12(1)(ఇ) అనుసరించి 2025–26 విద్యా సంవత్సరం నుంచి జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిందని స్పష్టం చేశారు. 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులకు చెందిన పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనారిటీ, ఓసీలకు చెందిన పేదలకు 6 శాతం సీట్లు ఇవ్వాలన్నారు. గ్రామీణప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.44 లక్షలలోపు ఉన్న వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆ మేరకు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యం ఈ నెల 26లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆదేశించారు. అలాగే ఉచిత నిర్బంధ విద్యాహక్కుచట్టం అర్హులైన తల్లిదండ్రులు ఈ నెల 28 నుంచి వచ్చే మే నెల 15 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఫిజికల్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని టీచర్లు సాధారణ బదిలీల్లో మెడికల్ గ్రౌండ్స్‌లో ప్రెఫరెన్షియల్ కేటగిరీకి దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజికల్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని చిత్తూరు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రెఫరెన్షియల్ కేటగిరీ టీచర్లు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి జిల్లా కేంద్రంలోని రుయాలో నిర్వహించే ఫిజికల్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. ప్రెఫరెన్షియల్ కేటగిరిలో దరఖాస్తు చేసుకోవాలనుకునే టీచర్లు సంబంధిత డీడీఓలు నిర్దేశించిన నమూనాలో తగిన ఆధారాలు జత చేసి తిరుపతి డీఈఓ కార్యాలయంలో ఈనెల 23వ తేదీలోపు అందజేయాలని కోరారు.

స్వదేశీ విద్యారాగం

'తిరుపతికి చెందిన రవిచంద్ర పేరొందిన ఇంజినీరింగ్ కళాశాలలో గత ఏడాది బీటెక్ పూర్తి చేశాడు. ఎలాగైనా అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సౌతర్న్ కాలిఫోర్నియాలో పీజీ చేయాలన్న చిరకాల కోరికతో ఏడాది కాలం ఆర్థిక వనరులతోపాటు వీసా ప్రయత్నాలు చేసుకుని సన్నద్ధమయ్యాడు. ఈ ఏడాది ఎఫ్1 వీసాకు దరఖాస్తు చేసుకుని ఎంతో ఖర్చు పెట్టాడు. కానీ నిరాశ మిగిలింది. వీసాకు అనర్హుడంటూ ఈమెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో పీజీ సెట్‌కు దరఖాస్తు చేసి ప్రిపరేషన్ మొదలు పెట్టాడు.'



విదేశీ విద్య నేటి విద్యార్థుల కల. ట్రంప్ కఠిన నిబంధనలు..వీసాలపై ఆంక్షలు.. అనర్హులని తిరస్కరణ.. పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు అవకాశాలలేమి.. ఆర్థిక సమస్యలు.. ఇంత కష్టపడినా విద్యకు దక్కని భరోసాతో అది యువతకు ఎండమావిగా మారింది. వెరసి.. విద్యార్థిలోకం విదేశీ విద్య వద్దు... స్వదేశీ విద్యే ముద్దు అంటూ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పలు కోర్సులు చేయడానికి మొగ్గు చూపుతోంది. ఫలితంగా పలు ప్రవేశపరీక్షలకు దరఖాస్తుల సంఖ్య పదిరెట్లు పెరిగింది.

- విదేశీ విద్యపై మొగ్గు చూపని యువత
- ట్రంప్ కఠిన నిబంధనలతో విద్యార్థిలోకం బెంబేలు
- పీజీ ప్రొఫెషనల్ కోర్సులకు దరఖాస్తుల వెల్లువ
- ఐసెట్, ఏపీఈఏపీసెట్‌కు పదిరెట్లు పెరిగిన అప్లికేషన్లు

తిరుపతి సిటీ: ట్రంప్ అన్నంత పని చేశాడు..స్టూడెంట్స్ వీసాలపై కఠిన నిబంధనలు విధించడంతో పాటు యూఎస్ఏలో విద్యనభ్యసిస్తున్న ఇండియన్ విద్యార్థులపై ఆంక్షలు విధించి ఇంటికి పంపుతున్నాడు. దీంతో 2025–2026 విద్యాసంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలని కలలు కన్న తెలుగు విద్యార్థుల ఆశలు అడియాసలయ్యాయి. దీంతో స్వదేశీ విద్యకు డిమాండ్ పెరిగింది. ఇటీవల రాష్ట్రంలోని పలు వర్సిటీలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్లు విడుదల చేశాయి. దీంతో పీజీ కోర్సులకు దరఖాస్తు చేసేందుకు విద్యార్థులు ఎగబడుతున్నారు. గత ఏడాదికంటే పీజీ సెట్లకు దరఖాస్తులు పదిరెట్లు పెరిగాయి.

విదేశీ విద్యపై మొగ్గు చూపని విద్యార్థులు

తిరుపతి జిల్లా నుంచి గత ఏడాది విదేశీ విద్య కోసం సుమారు 9,871 మంది ఎఫ్1 వీసా కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 6,245 మంది విద్యార్థులు అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియాల్లోని పలు వర్సిటీలలో వీసా సాధించి ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. కానీ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కేవలం ఇప్పటివరకు ఎఫ్1 వీసా కోసం కేవలం 761 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రొఫెషనల్ కోర్సులకు దరఖాస్తుల వెల్లువ

జిల్లాలోని పలు యూనివర్సిటీల్లో ప్రొఫెషనల్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఐసెట్, ఏపీఈఏపీసెట్, పీజీసెట్‌లకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది ఏపీఈఏపీసెట్‌కు 3వేలకు మించని దరఖాస్తులు ఈ ఏడాది 30 వేల పైచిలుకు వచ్చాయి. దీంతోపాటు ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు నిర్వహించనున్న ఐసెట్‌కు సైతం అదే తరహాలో దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యకు ఈ ఏడాది ఎస్వీయూ, మహిళా వర్సిటీల్లో పోటీ ఎక్కువగా ఉంటుందని, కటాఫ్ మార్కులు సైతం ఊహించని రీతిలో ఉంటాయని విద్యావేత్తలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఎఫ్1 వీసాల ఆంక్షలతో వెనుకడుగు

ప్రధానంగా ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగా ఉన్నా అమెరికాలో ఎంఎస్, ఎంటెక్, మెడికల్, పీజీ కోర్సులు చేయాలనే ఆశతో ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ట్రంప్ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు. కఠిన నిబంధనలు విధించడంతో జిల్లాలో ఈ ఏడాది విదేశాల్లో విద్యాభ్యాసానికి వీసాలకు దరఖాస్తు చేసుకున్న వారు 40 శాతం కూడా లేదని అమెరికన్ రాయబార కార్యాలయం తేల్చిచెప్పడం గమనార్హం. దరఖాస్తు చేసుకున్న వారిలోనూ 50 శాతం మంది విద్యార్థులను పలు సాకులు చూపించి (ఎఫ్1) స్టూడెంట్ వీసాలకు అర్హులు కాదని ముద్ర వేస్తున్నారు. ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపి వీసా కచ్చితం అనుకున్న విద్యార్థులకు సైతం ఏదో రూపంలో వీసాకు అన్‌ఫిట్ అంటూ ముద్రవేస్తున్నారు. దీంతో విదేశీ విద్యపై విద్యార్థులు వెనుకడుగువేస్తున్నారు.

స్థానిక వర్సిటీల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశం



విదేశీవిద్యకు ఆంక్షలు విధించడంతో స్వదేశంలోనే ఉన్నత విద్యనభ్యసించేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది పీజీ సెట్లకు సైతం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ప్రధానంగా ప్రొఫెషనల్ కోర్సుల్లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మెరిట్ స్టూడెంట్లు స్వదేశీ విద్యనభ్యసిస్తే విద్యారంగంలో పరిశోధనలు కొత్త పుంతలు తొక్కే అవకాశం ఉంటుంది. ఎస్వీయూలో కొత్తగా ప్రవేశ పెట్టిన ఎంఎస్ డేటా అనలాసిస్, ఏఐ వంటి కోర్సులతోపాటు ఎంబీఏ, ఎంసీఏలోనూ అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

–సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

ఎన్ఈపీతో ఉద్యోగావకాశాలు మెండు



నూతన విద్యావిధానంతో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయి. విదేశీ విద్యతో సమానంగా స్వదేశంలోనూ పలు వర్సిటీల్లో ప్రొఫెషనల్ కోర్సుల్లో అంతర్జాతీయ స్థాయి సిలబస్ అమలులో ఉంది. రూ.లక్షలు ఖర్చు పెట్టి విదేశీ విద్య కోసం ప్రయత్నించడం కంటే ఎన్ఈపీ విధానం అమలులో ఉన్న వర్సిటీల్లో ఉన్నత విద్యనభ్యసించడం ఎంతో ఉత్తమం. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ మెరుగుపడడంతో విద్యార్థులు విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఎఫ్1 వీసా కఠినతరంతో ఈ ఏడాది వర్సిటీల్లో అన్ని పీజీ కోర్సులకు అడ్మిషన్లు పెరగనున్నాయి.

–ప్రొఫెసర్ పద్మావతమ్మ, ప్రిన్సిపల్, సైన్స్ కళాశాల, ఎస్వీయూ

పీజీసెట్‌లకు పెరుగుతున్న దరఖాస్తులు



పీజీ సెట్ పరీక్షలకు గత ఏడాది కంటే ఈసారి దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. ట్రంప్ ఎఫెక్ట్ విదేశీ విద్యపై పెద్ద ప్రభావం చూపుతోంది. పీజీ ప్రొఫెషనల్ కోర్సులకు ఇప్పటికే ఊహించని రీతిలో దరఖాస్తులు వస్తున్నాయి. ఏపీ ఈ సెట్ గడువు ముగిసింది. గత ఏడాది 3,500 దర ఖాస్తులు రాగా ఈ ఏడాది 35 వేలకు మించడం ఊహించని పరిణామం.

–ప్రొఫెసర్ సురేంద్ర బాబు, కో కన్వీనర్, ఏపీ పీజీసెట్, ఎస్వీయూ

ఐసెట్‌కు దరఖాస్తు చేశా..



యూఎస్‌లో ఎంఎస్ చేయాలన్నది నా కల. కానీ ట్రంప్ ఆంక్షలతో భయమేస్తోంది. అక్కడ చదువుతున్న మా బంధువుల పిల్లలు సైతం ఇక్కడికి రావదని చెబుతున్నారు. దీంతో మా తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం ఎంసీఏ చేయడం కోసం ఐసెట్‌కు దరఖాస్తు చేశా. ఇక్కడే మంచి వర్సిటీలో ఎంసీఏలో చేరి పేరొందిన పరిశ్రమలో ఉద్యోగం సాధిస్తా.

–ప్రియాంక, విద్యార్థిని, తిరుపతి

అమెరికా ఆశలపై నీళ్లు చల్లారు



తిరుపతిలో బీటెక్ పూర్తి చేశా. అమెరికాలో ఎంఎస్ చేయాలనే కోరిక ఉండేది. అమెరికా వెళ్లి ఎంఎస్ పూర్తి చేసి, అక్కడే గ్రీన్‌కార్డు సాధించాలనే కోరిక ఉండేది. కానీ ట్రంప్ విధించిన ఆంక్షలతో వీసాకు దరఖాస్తు చేసుకున్నా టోఫెల్‌తోపాటు ఇంటర్వ్యూ పూర్తి చేశా. కానీ ఎలిజిబిలిటీ రాలేదు. దీంతో ఎస్వీయూలో ఎంబీఏ చేసేందుకు ఐసెట్‌కు దరఖాస్తు చేసుకున్నా.

–ప్రదీప్‌కుమార్, విద్యార్థి, తిరుపతి

ఆర్భాటపు డీఎస్సీ!



డీఎస్సీ పరీక్షకు ప్రైవేట్ సెంటర్ లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

సీఎం చంద్రబాబు.. డీఎస్సీ తొలి సంతకానికే దాదాపు 11 నెలలు సాగదీశారు.. ఇక నిరుద్యోగ అభ్యర్థుల ఒత్తిడి తాళలేక ఎట్టకేలకు బాబు జన్మదిన కానుకగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాగా పరీక్ష ఎప్పుడూ ఒకే రోజు నిర్వహించే డీఎస్సీని ఇప్పుడు నెల రోజులు నిర్వహించేలా మెలిక పెట్టారు. ఎందుకు ఇలా చేశారంటే.. ప్రజాధనాన్ని ప్రైవేటు సంస్థలకు దోచిపెట్టడం కోసమే ఇలా జరిపిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కాగా కనీసం అయిదు మాసాలు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటానికే పరిమితం కావడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు.

- బాబు జన్మదిన కానుకగా నోటిఫికేషన్
- దళితులకు, బీసీలకు ఇచ్చే ఉచిత శిక్షణపై మండిపాటు
- తొలిసారిగా సీబీటీ విధానంలో పరీక్షలంటూ మెలిక
- జిల్లాలో 1,478 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఉమ్మడి జిల్లాలో 1,478 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో వివిధ కేడర్‌లలో 1,473 పోస్టులను భర్తీ చేయనున్నారు. అధికంగా ఎస్జీటీ పోస్టులు 979 పోస్టులను భర్తీ చేయనున్నారు. మిగిలిన స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 499 పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం పోస్టుల వివరాలు

స్కూల్ అసిస్టెంట్ ల్యాంగ్వేజ్–1	38
స్కూల్ అసిస్టెంట్ హిందీ	17
స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్	104
స్కూల్ అసిస్టెంట్ గణితం	30
స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్	29
స్కూల్ అసిస్టెంట్ బయాలజీ	63
స్కూల్ అసిస్టెంట్ సోషియల్	130
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్	86
ఎస్జీటీ	976
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం గణితం	01
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం ఫిజిక్స్	01
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం బయాలజీ	01
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం ఎస్జీటీ	02
మొత్తం పోస్టులు	1,478

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	3,766
ప్రాథమికోన్నత పాఠశాలలు	444
ఉన్నత పాఠశాలలు	705

చిత్తూరు కలెక్టరేట్ : అధికారంలోకి రాగానే డీఎస్సీ పరీక్షను నిర్వహిస్తామంటూ గత ఎన్నికల సమయంలో టీడీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక సీఎంగా ప్రమాణ స్వీకారం రోజున చంద్రబాబు మెగా డీఎస్సీ పరీక్ష ఫైల్‌పై తొలి సంతకం చేశారు. అయితే పరీక్షల నోటిఫికేషన్ జారీ చేయకుండా నెలల తరబడి సాగదీశారు. చివరికి క్షేత్రస్థాయిలో నిరుద్యోగుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు చెలరేగాయి. తాజాగా ఈనెల 20న చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆర్భాటంగా నోటిఫికేషన్‌ను మంత్రి లోకేష్ విడుదల చేశారు. కాగా సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామంటూ మెలిక పెట్టడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు.

నిధులను కాజేసేందుకేనా..

సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించాలంటే అందుకు సరిపడే సౌకర్యాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కేంద్రాల్లో లేవు. ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ ఇంజినీరింగ్, మరికొన్ని కంప్యూటర్ కేంద్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రైవేట్ కేంద్రాల్లో సీబీటీ విధానంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణకు రూ.కోట్ల కొద్ది బిల్లులు చెల్లించాల్సి వస్తుంది. అదే పాత విధానంలో ఒకే రోజు డీఎస్సీ పరీక్షను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల కేంద్రాల్లో నిర్వహిస్తే ప్రభుత్వానికి తక్కువ ఖర్చుతో సరిపోయేది. అలా కాకుండా డీఎస్సీ పరీక్షను నెల రోజుల పాటు ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించి నిధులను నొక్కేసేందుకు ప్రణాళిక రచించినట్లు విమర్శలున్నాయి.

మొక్కుబడిగా ఉచిత శిక్షణలు

డీఎస్సీ పరీక్షకు ఉచిత కోచింగ్ హామీ ప్రకారం నోటిఫికేషన్‌కు కనీసం అయిదు నెలల ముందు శిక్షణ ఇచ్చి ఉంటే నిరుద్యోగులకు ఉపయోగం ఉండేది. ఉచిత కోచింగ్ అంటూ ప్రచారం చేసిందే తప్ప శిక్షణ ఇచ్చిన పాపాన పోలేదు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ప్రారంభించినప్పటికీ 5 మంది అభ్యర్థులు కూడా లేరు. ఎస్సీ అభ్యర్థులకు ఇటీవలే శిక్షణ ప్రారంభించారు. శిక్షణ కేంద్రాల్లో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు లేకపోవడంతో అభ్యర్థులు ఉచిత శిక్షణ పై నమ్మకం లేక ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఉచిత శిక్షణ లోనూ ప్రభుత్వం నిరుద్యోగులను మోసగించింది.

పరీక్షలు నెలరోజులా..

డీఎస్సీ పరీక్షను ఈసారి తొలిసారిగా సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నోటిఫికేషన్‌లో తెలియజేశారు. సీబీటీ విధానం ప్రకారం పరీక్షలను నెల రోజుల పాటు నిర్వహించనున్నారు. గతంలో ఒక్క రోజులోనే డీఎస్సీ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే వారు. ఉద్దేశపూర్వకంగా ఏదో ఒక మెలిక పెట్టాలనే ఇలా నిర్వహిస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

దళితులను మోసగించింది



ఉచిత డీఎస్సీ శిక్షణ ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం దళితులను మోసగించింది. దూర ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి రొడ్డెక్కేలా చేసింది. ప్రణాళిక ప్రకారం ఎస్సీ నిరుద్యోగులకు ఇవ్వాల్సిన ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇప్పించడంలో ప్రభుత్వం విఫలమైంది.

– నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఇబ్బంది పెట్టడం సరికాదు



డీఎస్సీ నిరుద్యోగులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదు. మెగా డీఎస్సీ నిర్వహించడం హర్షణీయమే. ప్రమాణ స్వీకారం రోజున సంతకం చేశారు. నోటిఫికేషన్ ఇచ్చేందుకు పది నెలలకు పైగానే సమయం పట్టింది. అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉచిత శిక్షణ సక్రమంగా ఇచ్చారా అంటే అదీ లేదు.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి

క్షేత్రం..జన సంద్రం

- శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల ఆదివారం తిరుమల భక్తులతో కిక్కిరిసిపోయింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ముగియడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. టీటీడీ కూడా దీనికి తగినట్టుగా ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం చోటు చేసుకోకుండా భక్తులకు పాలు, పులిహోర వంటివి నిరంతరం పంపిణీ చేస్తోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 78,821 మంది స్వామివారిని దర్శించుకోగా 33,568 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్యూలో భక్తులకు కుచ్చుటోపీ

శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు స్థానిక చిరువ్యాపారులు భక్తులకు తినుబండాలను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. క్యూలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అయితే వీరిని అరికట్టాల్సిన విజిలెన్స్ సిబ్బంది మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం.



ఏటీసీ వద్ద క్యూలో కూర్చుని ఉన్న భక్తులు

నారాయణగిరి షెడ్లలో అదనపు ఈఓ తనిఖీలు

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో నారాయణగిరి షెడ్ల వద్ద టీటీడీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి ఆదివారం ఉదయం తనిఖీ చేశారు. క్యూలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు ఇబ్బంది పడకుండా నిరంతరాయంగా అన్న ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు రాజేంద్ర, హరీంద్రనాథ్, వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.

ఆధునిక కాలానికి సంస్కృతం అవసరం

తిరుపతి సిటీ: ఆధునిక కాలానికి సంస్కృత భాష ఎంతో అవసరమని, భాష ఆవశ్యకతను భవిష్యత్తు తరాలకు పెద్ద ఎత్తున తెలియజేయాల్సిన అవసరం ఉందని అఖిల భారతీయ సంఘ కార్యవాహ్ సురేష్ సోని అభిప్రాయపడ్డారు. జాతీయ సంస్కృత వర్సిటీ, సంస్కృత భారతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్ఫూర్తి సంఘమం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సంస్కృతాన్ని ప్రతి ఒక్కరూ చదువుకుని, అందులోని జ్ఞానాన్ని పొందాలని సూచించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో సంస్కృత భాషను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు వర్సిటీ తన వంతు కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్కృత భారతి అఖిల భారతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపబంధు మిశ్రా, కేంద్రీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీవాస వార్కేడి, డాక్టర్ ఎంజీ నందన్‌రావు, డాక్టర్ ఎస్ఎల్ సీతారాం శర్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతిఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. ఆ మేరకు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. ఈనెల 14వ తేదీన గ్రీవెన్స్ నిర్వహించలేదు. ఈ క్రమంలో సోమవారం గ్రీవెన్స్‌కు పెద్ద ఎత్తున అర్జీదారులు వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్య

చిల్లకూరు: స్నేహితురాలి తల్లి, పిన్నమ్మలు దూషించారని ఓ బాలిక మనస్తాపం చెందిన ఇంట్లో ఉరి వేసుకుని మరణించిన సంఘటన బూదనంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బూదనం గ్రామానికి చెందిన ఓ బాలిక పది పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉన్న సమయంలో తన స్నేహితురాలు ఇంటి వద్దకు వచ్చింది. ఆ సమయంలో స్నేహితురాలి తల్లి రమణమ్మ, పిన్ని అశ్వినీ అక్కడికి వచ్చి తన బిడ్డ నీ కారణంగా చెడిపోతుందని దూషించారు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలిక రాత్రి అందరూ నిద్రించిన తరువాత ఉరి వేసుకుంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు బాలికను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ బాలిక మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

సైదాపురం: కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ కమిషనర్ శ్రీనివాసులు వెల్లడించారు. మైకా కార్మిక సంక్షేమ సంస్థ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసి 80 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో కలిచేడు పాఠశాలలో ఆదివారం ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయనతో పాటు అసిస్టెంట్ కమిషనర్ అభినవ్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాల ఏర్పాటు చేసి నేటికి 80 ఏళ్లు పూర్తి కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలు కార్యక్రమాలు నిర్వహించారు.

జలాశయం.. నిరాశమయం

అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని చందంగా మారింది అరణియార్ డ్యామ్ పరిస్థితి. రూ.కోట్ల నిధులున్నాయి.. ఆరేళ్లుగా మూలుగుతున్నాయి.. టెండర్లు పూర్తయ్యాయి. అయినా ఆధునికీకరణ పనులు ముందుకు సాగలేదు. ఇందుకు కాంట్రాక్టర్.. కూటమి సర్కారు నిర్లక్ష్యమే కారణం. ఫలితంగా అరణియార్ ఆధునికీకరణ అటకెక్కింది. జలాశయం రైతుల్లో నిరాశ నెలకొంది.

- కలగా మిగిలిన అరణియార్ ఆధునికీకరణ
- ఆరేళ్లుగా మూలుగుతున్న రూ.35 కోట్ల జైకా నిధులు..
- జైకా నిధులకు సాంకేతిక మంజూరు మెలిక..

వరదయ్యపాళెం: అరణియార్ జలాశయం ఆధునికీకరణ నిరాశమయమైంది. జలాశయం అభివృద్ధికి మంజూరైన జైకా నిధులు ఆరేళ్లుగా మూలుగుతున్నాయి. దీంతో అరణియార్ ఆధునికీకరణ కలగా మిగిలిపోనుందా? అని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం అరణియార్ ఇంజినీరింగ్ అధికారులకు 2014లో జపాన్ ఇండస్ట్రీస్ కోఆపరేటివ్ అసిస్టెన్స్(జైకా)కు రూ.35.60 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదే ఏడాది డిసెంబర్ నెలలో ప్రాజెక్టును సందర్శించిన జైకా బృందం రూ.35.60 కోట్లను మంజూరు చేయడానికి అంగీకరించింది. ఈ మేరకు నిధులు సైతం గత ప్రభుత్వం మంజూరు

మహానేత హయాంలో రూ.26 కోట్లతో ఆధునికీకరణ

అరణియార్ ప్రాజెక్టును గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2006 సంవత్సరంలో రూ.26 కోట్ల నిధులతో ఆధునికీకరించారు. ఈ నిధులతో ప్రాజెక్టుకు కొత్త రేడియల్ స్పిల్‌వే గేట్లు, అక్విడేట్, ప్రాజెక్టుకు చెందిన ప్రధాన కాలువల లైనింగ్ పనులు పూర్తి చేశారు.



పిచ్చాటూరులో అరణియార్ ప్రాజెక్టు

చేసింది. అయితే పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కారణం ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో ఆలస్యం చూపడమే. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంత ఒత్తిడి చేసినా కదలికలు లేకపోవడంపై ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు.

5,500 ఎకరాలు ఆయకట్టు

అరణియార్ ప్రాజెక్ట్‌ను 1955లో అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నిర్మించారు. ప్రాజెక్టు పరిధిలో పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో 5,500 ఎకరాలు ఆయకట్టు ఉంది. దీంతోపాటు నింద్ర, విజయపురం మండలాలకు పైలెట్ ప్రాజెక్టు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుంది. ఈ నాలుగు మండలాలతోపాటు కేవీబీ పురం మండలంలోని మత్స్యకారులు ప్రాజెక్టులో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఐదు మండలాలకు చెందిన ప్రజల అవసరాలను వివిధ రూపాల్లో తీర్చుతున్న



పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు వద్ద పాడైన పిట్టగోడ



అర్ధంతరంగా ఆగిపోయిన పిట్టగోడ పనులు

అధ్వాన్నంగా కాలువ

మధ్య తూము కాలువ అధ్వానంగా ఉంది. ఈ కాలువను 60 ఏళ్ల కిందట నిర్మించారు. ప్రస్తుతం కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రాజెక్టులో నీరు పొలాలకు చేరని పరిస్థితిలో ఉంది. ఈ కాలువ నుంచి నీటి విడుదల చేస్తే ఇరువైపులా ఉన్న పొలాల్లోకి పొంగి పార్లుతుంది. ప్రాజెక్టులో నీరున్నా పొలాలకు చేరలేని పరిస్థితి దాపురించింది. దీనిపై అధికారులు చొరవ చూపాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టును ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యం చేశారు.

జైకా నిధులతో చేపట్టాల్సిన పనులివీ..

జైకా నిధులతో ప్రాజెక్టుకు నూతన రెడియల్ స్పిల్‌వే గేట్ల వెనక భాగాన సేఫ్టీ గేట్లు నిర్మాణం, 3 కిలోమీటర్ల మేర కట్ట ఆధునికీకరణ, మధ్య తూము కాలువ లైనింగ్, నూతన అతిథి గృహం, నూతన ఇరిగేషన్ కార్యాలయాల సముదాయం పనులు చేపట్టాల్సి ఉంది. కానీ పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. కారణం కూటమి ప్రభుత్వంలో బిల్లులు అందుతాయో లేదో అన్న సందేహంతో వెనుకడుగు వేస్తున్నారు.

జోరుగా మట్టి అక్రమ రవాణా

అరణియార్ ప్రాజెక్టులో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఫలితంగా జలాశయం అంచుల్లో పెద్దఎత్తున గుంతలు ఏర్పడి వరద ప్రవాహంతో ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నతాధికారులు మట్టి అక్రమ రవాణాను నియంత్రించాల్సి ఉంది.

ఏర్పేడు దుర్ఘటనకు 8ఏళ్లు



మునగలపాళెం వద్దనున్న స్మారక స్థూపం

రేణిగుంట: సరిగ్గా ఎనిమిదేళ్ల కిందట ఇసుక అక్రమ రవాణాపై గళమెత్తిన గొంతులు శాశ్వతంగా మూగబోయిన దుర్ఘటన నేటికీ ఆ గ్రామస్తులకు పీడకలే.. ఏర్పేడు మండలం మునగలపాళెం గ్రామ శివారున ఉన్న స్వర్ణముఖి నదిలో ఇసుకను జేసీబీలు పెట్టి అక్రమ రవాణా చేస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు దెబ్బతింటున్నాయని స్థానికులు, చిన్న, సన్నకారు రైతులు ధర్నా చేసేందుకు 2017, ఏప్రిల్ 21న మండల కేంద్రానికి వచ్చారు. పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 16 మంది బలయ్యారు. ఈ ఘటనకు అప్పట్లో టీడీపీ మండల నాయకులు పేరం ధనంజయులునాయుడు, పేరం నాగరాజునాయుడు, చిరంజీవులునాయుడు మరి కొంత మందిపై నామమాత్రపు కేసులు పెట్టి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయితే కొంతకాలానికి వారు మళ్లీ పార్టీలో చేరి మండలాన్ని ఏకఛత్రాధిపత్యం కింద ఏలుతున్నారు.

నేడు స్మారక స్థూపం వద్ద నివాళులు

ఇసుక ప్రమాద ఘటనలో అశువులు బాసిన రైతుల స్మారక చిహ్నాన్ని మునగలపాళెం గ్రామం వద్ద ఏర్పాటు చేశారు. అక్కడ సోమవారం బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు, ప్రజా సంఘాలు నివాళులర్పించనున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





శ్రీవారి ఆలయం వద్ద సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీరమణ, విప్ బొలిశెట్టి శ్రీనివాసులు



శ్రీవారి ఆలయం వద్ద కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి

తిరుమల: శ్రీవారిని ఆదివారం రాత్రి సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీరమణ, కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి వేర్వేరుగా దర్శించుకున్నారు. చిత్తూరు జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, విప్ బొలిశెట్టి శ్రీనివాసులు దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పచ్చని పంట దున్నేసింది

- పంటలపై క్రిస్ సిటీ పడగ

చిల్లకూరు: కోట మండలం కొత్తపట్నంలో రైతులు సాగు చేసిన దిగుబడికి చేరువలో ఉన్న వేరుశనగ పంటను క్రిస్ సిటీ యాజమాన్యం ఆదివారం దున్నేసింది. వేరుశనగ పంటను జేసీబీలతో తవ్వి చదును చేయడంతో తమ కష్టం పోతుందని కన్నీటి పర్యంతమవుతున్నారు. చిల్లకూరు, కోట మండలాల్లో తీర గ్రామాలైన తమ్మినపట్నం, కొత్తపట్నం మధ్యలో సుమారు 900 ఎకరాల వరకు భూములను క్రిస్ సిటీ కోసం సేకరించారు. గత ప్రభుత్వ హయాంలో సాగుదారులు, రైతులతో చర్చలు జరిపి పరిహారం అందించిన తరువాతే భూములు స్వాధీనం చేసుకుంటామని మాట ఇచ్చారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత భూములు కోల్పోతున్న రైతులపై అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. గతంలో భూములు సేకరించే నాటికి పరిహారం అందిస్తామని చెప్పారు. అప్పట్లోనే సర్వేలు పూర్తి చేసినప్పటికీ నేటికీ పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు తమ ఆధీనంలోని భూముల్లో మరోసారి వేరుశనగ సాగు చేశారు. ఆ పంట మరో పది రోజుల్లో కోతకు వచ్చే దశలో ఉంది. పంట దిగుబడి వస్తే ఎకరాకు రూ.1.5 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. అలాంటి సమయంలో క్రిస్‌సిటీ యాజమాన్యం ఆ భూముల్లో పంటను ధ్వంసం చేస్తుండడంతో రైతులు అల్లాడిపోతున్నారు. శనివారం జిల్లా కలెక్టర్ పర్యటనకు వచ్చిన సమయంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు ఇవ్వడంతోనే ఇలా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కోట తహసీల్దార్ జీజే రావును వివరణ కోరగా క్రిస్ సిటీలో చేపట్ట రోడ్డు పనులకు ఆ భూముల్లో ఎంతవరకు భూమి అవసరమో? అంతవరకు యంత్రాలతో చదును చేస్తున్నామని, త్వరలోనే పరిహారం అందించేలా చూస్తామని అన్నారు.

సీఎం జన్మదినం సాక్షిగా

భగ్గుమన్న విభేదాలు

- రెండు చోట్ల పోటా పోటీగా సీఎం జన్మదిన వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మండలంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న టీడీపీలోని వర్గ విభేదాలు సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలతో భగ్గుమన్నాయి. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా విడిపోయి, రెండు చోట్ల నిర్వహించారు. దీంతో మండలంలో టీడీపీ నాయకుల వర్గపోరు ఒక్కసారిగా భగ్గుమంది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సస్పెన్షన్ విధించిన నాటి నుంచి నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సస్పెన్షన్‌లో ఉన్న ఎమ్మెల్యేతో కలవలేక, పార్టీ ఆదేశాల అనుగుణంగా ఎవరికి వారు ఎమ్మెల్యేతో పని లేకుండా పార్టీ కార్యక్రమాలు జరుపుకుంటున్నారు. మరో వైపు పార్టీ ఆదేశాలను పక్కన పెట్టి ఎమ్మెల్యే తమకు ముఖ్యమని ఆయన ఆదేశాలకు అనుగుణంగా మరో వర్గం నేతలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో రెండు దఫాలుగా ఎమ్మెల్యే, ఇతర ముఖ్య నాయకుల పుట్టిన రోజు వేడుకలు రెండు గ్రూపులుగా చేయటంపై విమర్శలొస్తున్నాయి. ఈ తరుణంలో తెలుగు తమ్ముళ్లు పార్టీ ఆదేశాల అనుసారం నడుచుకున్నే వర్గం వైపు ఉండలా లేక సస్పెన్షన్‌లో ఉన్న ఎమ్మెల్యే వైపు ఉండాలా? అర్థం కాక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కొందరు తమ్ముళ్లు రెండు వైపులా ఉంటూ తెలివిని ప్రదర్శిస్తున్నారు. పార్టీలోని వర్గ విభేదాలపై మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

మూడు వర్గాలు.. మూడు ప్రాంతాల్లో..

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలో తెలుగుదేశం పార్టీలోని మూడు గ్రూపులు మూడు వర్గాలుగా చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆదివారం పట్టణంలో మూడురోడ్ల కూడలిలో టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఆర్టీసీ బస్టాండ్ వద్ద శివయ్య, పృథ్వి, శివకుమార్ ఆధ్వర్యంలో, యువ నాయకుడు కోళ్ల చిన్న(మురళి), బాలసుందరంరెడ్డి, లోకయ్యరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద మూడు ప్రాంతాల్లో వేర్వేరుగా సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించడంతో చంద్రబాబు జన్మదినం రోజున పార్టీలో వర్గాలు బహిర్గతం కావడంతో కార్యాకర్తలు ఎటు వెళ్లాల్లో దిక్కుతోచక ఎవరికి వారు వెళ్లారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖనాయుడు, సమన్వయకర్త శ్రీపతిబాబు స్థానిక పార్టీ నాయకులను సమన్వయపరచడంలేదన్న విమర్శలు వినిపించాయి.

అధికారుల పరిస్థితీ అంతే..

అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాలు పాలు పంచుకునేందుకు ఎవరిని పిలవలో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మేము చెప్పిందే జరగాలని ఒక వర్గం అంటుంటే, మా కనుసన్నల్లోనే జరగాలని మరో వర్గం హుకుం జారీ చేస్తుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. టీడీపీ పోటాపోటీ వర్గపోరుతో మండలంలోని అభివృద్ధి కుంటుపడుతుంది. కూటమి ప్రభుత్వంలో నాయకులు బలబలాలు నిరూపించేందుకు సమయాన్ని వెచ్చించుకుంటున్నారని, అభివృద్ధి పనులను, ప్రజాసమస్యలను గాలికి వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధిష్టానం దృష్టి సారించి మండలంలోని వర్గవిభేదాలు లేకుండా చేసి, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాత్రింబవళ్లు సైఖితం!

స్వర్ణముఖిని పచ్చనేతలు గుంతలమయంగా మార్చేస్తున్నారు. యంత్రాల సాయంతో ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేస్తున్నారు. రాత్రింబవళ్ల తేడా లేకుండా టిప్పర్లు.. ట్రాక్టర్లతో అక్రమ రవాణా సాగిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తమ పరిధి కాదంటూ ఒకరిపై ఒకరు వంతులు వేసుకుంటున్నారు. కుంటి సాకులతో కాలయాపన చేసేస్తున్నారు. ఇదే అదును అక్రమార్కులు మరింతగా రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా తెల్లబంగారాన్ని తోడేస్తూ.. రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు.



ముసలిపేడు వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం



శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడుకండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ రవాణా

- స్వర్ణముఖి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో రెచ్చిపోతున్న పచ్చనేతలు
- తమ పరిధి కాదంటూ తప్పుకుంటున్న తహసీల్దార్లు

రేణిగుంట/ శ్రీకాళహస్తి : టీడీపీ నేతల ధనదాహానికి స్వర్ణముఖి నది కుదేలవుతోంది. ఇసుకాసురుల చెరలో చిక్కి శల్యమవుతోంది. ఈ క్రమంలోనే ఆదివారం శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగ, ఏర్పేడు మండలం ముసలిపేడు పరిసరాల్లో ఫ్లై ఓవర్ వంతెన కింద స్వర్ణముఖి నదిలో తెల్లవారుజాము నుంచే జేసీబీలతో ఇసుకను తోడి ట్రాక్టర్లలో తరలించారు. టీడీపీ ముఖ్యనేత ఆదేశాలతోనే స్థానిక నేతలు ఇసుకను తోడేస్తున్నట్లు గ్రామస్తులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో శ్రీకాళహస్తి, ఏర్పేడు తహసీల్దార్లు అది తమ పరిది కాదని కాలయాపన చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఇసుక అక్రమ రవాణా మాత్రం నిరాటంకంగా కొనసాగడం గమనార్హం.

రెచ్చిపోతున్న పచ్చతోడేళ్లు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొంతకాలంగా తొట్టంబేడు మండలం పెన్నలపాడు, విరూపాక్షిపురంలో ఇసుక తరలించేవారు. అక్కడి ప్రజలు అడ్డుకోవడంతో అక్రమార్కులు ముసలిపేడు, సుబ్బానాయుడుకండ్రిగపై దృష్టి సారించారు. స్థానికులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. శ్రీకాళహస్తి రూరల్, ఏర్పేడు పోలీసులు అయితే ఆదివారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో ఇసుక తవ్వకాల వీడియోలు వైరల్ అవుతున్నా కన్నెత్తి చూడక పోవడం విమర్శలకు తావిస్తోంది.

తుస్సుమంటున్న పోషణ్ వాటిక

పథకం సరే...పర్యవేక్షణ కరువు

తిరుపతి అర్బన్: కేంద్ర సర్కార్ పోషణ్ వాటిక పథకం తుస్సుమంటోంది. ఈ పథకం ద్వారా ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు కేటాయించారు. ఆ నిధులతో అంగన్‌వాడీ పాఠశాల ప్రాంగణంలో ప్రకృతి సేద్యం ద్వారా ఆకుకూరలు, పలు కూరగాయలు సాగు చేసి, వాటిని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లల కు అందిస్తున్న ఆహారంలో వినియోగించా లని సూచించారు. జిల్లాలో 2,492 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో గర్భిణు లు 12,788 మంది, బాలింతలు 11,007 మంది, ఆరునెలలు లోపు పిల్లలు 9,627 మంది, 6 నెలలపైన 3 ఏళ్ల లోపు 65,433 మంది, 3–6 ఏళ్ల లోపు పిల్లలు 47,814 మంది ఉన్నారు. అయితే 2,492 అంగన్‌వా డీ కేంద్రాల ప్రాంగణంలో ఖాళీ స్థలంతో పాటు నీటి సౌకర్యం కేవలం 475 కేంద్రాలను మాత్రమే పోషణ్ వాటిక పథకానికి ఎంపిక చేశారు. ఆ మేరకు మూడు నెలల క్రి తమే ఒక్కో పాఠశాలకు రూ.10 వేలు వంతున 475 కేంద్రాలకు రూ.47.50 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో అంగన్‌వాడీ వర్కర్లు కూరగాయల విత్తనాలు కొనుగో లు చేసి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేసి, కూరగాయలు పండించాల్సి ఉంది. అయితే నిధుల కేటాయింపుతో అధికారులు చేతులు దులుపుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దీంతో నే పథకం ప్రారంభంలోనే తుస్సుమందని చర్చించుకుంటున్నారు. అధికారులు పర్యవేక్షణ కొరవడడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పలువురు భావిస్తున్నారు.



పోషణ్ వాటిక పథకం నిధులతో సాగులోని తోట

పర్యవేక్షిస్తున్నాం



జిల్లాలో పోషణ వాటిక పథకంపై పర్యవేక్షిస్తున్నాం. కొందరు కూరగాయలు పండిస్తున్నారు. కొన్నిచోట్ల నీటి ఇబ్బందులతో సమస్యలున్నాయి. వాటిని అధిగమించి చక్కగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించేలా ఆదేశాలు ఇస్తాం. ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.

–వసంత బాయి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్

ఓం శుపథం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి తుడా: స్థానిక భవానీ నగర్‌లో ఆదివారం ఓం శుపథం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి, వన్నెకుల క్షత్రియ సంఘం చైర్మన్ సీఆర్ రాజన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్, మేయర్ డాక్టర్ శిరీష ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఎండీ డాక్టర్ టి విఠల్‌మోహన్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, గైనిక్ మెటర్నటీ, జనరల్ మెడిసన్, ఫిజియోథెరపీ తదితర సౌకర్యాలు ఆస్పత్రిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, డాక్టర్ కే సుభాషిణి, వైద్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

అగ్నిమాపక విన్యాసాలు



విన్యాసాలు నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి క్రైం : అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని ఉప్పరపల్లి, రామానుజ సర్కిల్, ఉపాధ్యాయ నగర్ ప్రాంతాలలో విన్యాసాలు నిర్వహించారు. ఏదైనా అనుకోని సంఘటనతో సిలిండర్‌లో నుంచి మంటలు చెలరేగితే వాటిని ఎలా అదుపు చేయాలనే దానిపై ఓ ప్రైవేట్ అపార్ట్మెంట్ వద్ద అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వీడిపై పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకోవడంతో అత్యవసర సమయాల్లో ఎంతో ద్రోహపడుతుందన్నారు. దీంతో వారం రోజులుగా జరుగుతున్న వారోత్సవాలు ముగిశాయి.